క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): ఆర్టీసీ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లలో మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 వరకు వినోబా నగర్, శివాలయం, ఆంజనేయస్వామి గుడి ఏరియా, చెన్నంవారి వీధి, మారుతీనగర్, కమ్యూనిస్టు బొమ్మలు, బావాజీ మఠం, అల్లీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని టీ–4 డీఈఈ పి.ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- 11 కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్‌లో చెట్లు తొలగించడం, లైన్ మెయింటెనెన్స్ కారణంగా లక్ష్మీపురం మెయిన్ రోడ్, పండరీపురం 4వ లైన్‌వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేయం జరుగుతోందని టీ–2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని, 6వ తేదీన జరగనున్న కేబినెట్ సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్‌కు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నేతలు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశం హాల్ వద్ద మంత్రిని కలుసుకుని పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి జి.నాగరాజు, కోశాధికారి కె.రాంబాబు, నాయకులు దొడ్డా గంగాధర్, సిహెచ్ నాగవంశీ తదితరులు ఉన్నారు.

ఏఐ రీసెర్చ్ సెంటర్ ప్రారంభం



గుంటూరు మెడికల్: దేశంలో ఎక్కడా లేని విధంగా డెంటల్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) రీసెర్చ్ సెంటర్‌ను గుంటూరులోని కేర్ విద్యాసంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్, ఆయన తనయుడు కేర్ విద్యాసంస్థల సీఈఓ డాక్టర్ ముజాహిద్ అలీ ఏర్పాటు అభినందనీయమని కెనడాకు చెందిన సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ సింగ్ అన్నారు. స్థానిక పాత్తూరులోని కేర్ డెంటల్ వైద్యశాల, కళాశాలలో సోమవారం ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్సీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రొఫెసర్ వినయ్ సింగ్, వైద్యులు డాక్టర్ షబ్బీర్ అమానుల్లా, డాక్టర్ రూపేష్ ఆదీమూలం, డాక్టర్ ప్రదీప్ సింగ్ కుందిలు ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అతిథులను డాక్టర్ రసూల్, డాక్టర్ ముజాహిద్ అలీ ఘనంగా సత్కరించారు. విద్యాసంస్థల మేనేజ్‌మెంట్, సిబ్బంది, పాల్గొన్నారు.

బోరుగడ్డ అనిల్‌పై కేసు నమోదు

లక్ష్మీపురం: చర్చి నిర్మాణానికి ఫారిన్ ఫండ్ రూ. కోటి వరకు ఇప్పిస్తానని రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోరుగడ్డ అనిల్‌పై గుంటూరు పట్టాభిపురం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ 3వ లైన్‌కు చెందిన బోరుగడ్డ అనిల్ చిలకలూరిపేటలో ఏఈఎల్‌సీ పాస్టర్‌గా పని చేసే తాడేపల్లి మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన నల్లపు మరియదాసుకు చర్చి నిర్మాణానికి రూ.కోటి వరకు ఫారిన్ ఫండ్ ఇప్పిస్తానని దానికి గాను ఖర్చు అవుతుందని రూ.10లక్షల వరకు అవుతుందని నమ్మబలికి, 2020 మే 5న తొలుత రూ.5 లక్షలు తీసుకున్నాడు. ఏవిధంగా ఫండ్ వస్తుందో చెప్పాల్సిందిగా అడగడంతో ఇష్టానుసారంగా బూతులు తిట్టి చంపుతానని బెదిరించాడని బాధితుడు తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత హామీలతో రసవత్తరంగా ఢిల్లీ ఎన్నికలు

లక్ష్మీపురం: ఫిబ్రవరి 5న జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమరంలో రాజకీయ పార్టీల ఉచిత హామీల వ్యూహంలో ఢిల్లీ వాసులు గందరగోళంలో ఉన్నారని, మొత్తం మీద పోటీ రసవత్తరంగా జరుగుతుందని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థకార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీలోని పార్టీలు మహిళా ఓటర్లను కేంద్రంగా చేసుకొని ఎన్నికల మేనిఫెస్టోలలో వాగ్దానాల వర్షం కురిపిస్తున్నాయన్నారు. రాజ్యాంగ చర్చా వేదిక కార్యదర్శి అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గూడవల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.సింగరయ్య, మల్లేశ్వరరావు ప్రసంగించారు.

ట్రంప్ చర్యల వల్ల అమెరికాకే నష్టం...

లక్ష్మీపురం: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శరవేగంగా తీసుకుంటున్న చర్యలు, చేస్తున్న ప్రకటనలతో ఆదేశానికి మేలు జరగకపోగా నష్టమే ఎక్కువ జరుగుతుందని జన విజ్ఞాన వేదిక నాయకుడు సిహెచ్ చలమారెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రాణాలు పోతున్నా పట్టదా!

- నగరంలో పగటి వేళే అడ్డగోలుగా తిరుగుతున్న భారీ వాహనాలు
- సన్న సందుల్లోకి కూడా వచ్చేస్తున్న ట్రాక్టర్‌లు, లారీలు
- రెండు రోజుల క్రితం ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి
- ఇటీవల లారీ ఢీకొట్టి విద్యుత్ స్తంభాలు పడిపోయిన పరిస్థితి
- సమస్య పట్టని ట్రాఫిక్, ఆర్టీఓ అధికారులు



ఇటీవల ఇసుక లోడ్‌తో ఉన్న ట్రాక్టర్‌ను పట్టుకుని పంపించిన వేసిన పోలీసులు

పట్నంబజారు: నగరంలో భారీ వాహన యజమానులు నిబంధనలకు తిలోదకాలిస్తూ పట్టపగలే తిరిగేస్తున్నా ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఇటీవల జరిగిన ఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నా.. వీరికి మాత్రం చీమకుట్టినట్లయినా లేదని బాహాటంగా చెప్పుకొంటున్నారు.



ట్రాక్టర్‌లకు వెలసిన 'జీఎంసీ ఆన్ డ్యూటీ'

కళ్లు తెరిపించని బాలుడి మృతి ఘటన

గత రెండు రోజుల క్రితం నల్లపాడు రోడ్డులో జరిగిన ప్రమాదంలో సాయిదుర్గారోహిత్‌కృష్ణ (15) అనే బాలుడు ట్రాక్టర్ ఢీకొనడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 15 సంవత్సరాల వయసు ఉన్న తరుణ్ అనే బాలుడు తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్నాడు. ఇద్దరూ మైనర్లు వాహనం నడపటం ఖచ్చితంగా తప్పే. అయితే ప్రమాదం జరిగిన సమయం మధ్యాహ్నం 3.30 నిముషాలు. ట్రాక్టర్‌ను వెనుక నుంచి వెళ్లి బాలురు ఢీకొట్టారని పైకి చెబుతున్నప్పటికీ.. హిట్ అండ్ రన్ అనే అనుమానాలు కలుగుతున్నాయి. ట్రాక్టర్ ఆచూకీ ఇప్పటీ కూడా తెలియరాలేదంటే... ట్రాక్టర్ అసోసియేషన్‌లకు, పోలీసులకు మధ్య ఉన్న సత్సంబంధాలు ఇట్టే అర్థమవుతాయి. ఇదేవిధంగాగత నాలుగు రోజుల క్రితమే నగరంలోకి వచ్చిన ఒక లారీ లాలాపేట పోలీసుస్టేషన్ సమీపంలో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టడంతో ఏడు స్తంభాలు పడిపోయి, రెండు రోజుల పాటు ఆ ప్రాంతమంతా అంధకారంగా మారింది.

నిబంధనలకు నీళ్లు..

నగరంలో ఉదయం సమయంలో భారీ వాహనాలు తిరగకుండా నిలువరించాల్సిన పోలీసులు నోటు కోసం నిబంధనలకు నీళ్లొదులుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పట్టపగలు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ట్రాక్టర్‌ను పిలిపించి మరీ పనులు చేయించుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా నగరంలో ఉదయం వేళల్లో ప్రభుత్వ పనులు, కట్టడాల కోసం తరలించే సామగ్రి కోసం పలు ట్రాక్టర్‌లు, లారీలకు అనుమతినిచ్చారు. ఇదే అదునుగా కొంత మంది ట్రాక్టర్ యజమానులు 'ఆన్ జీఎంసీ డ్యూటీ' స్టిక్కర్‌లు వేసుకుని మరీ తిరిగేస్తున్నారు. దీనిపై ట్రాఫిక్ ఉన్నతాధికారి కార్యాలయ సిబ్బందిని అడడగా ఎటువంటి అనుమతులు లేవని తెలపడం విశేషం.



ప్రమాదంలో మృతి చెందిన రోహిత్‌కృష్ణ, గాయపడిన తరుణ్(ఫైల్)

మామూళ్లు మామూలే..!

గత కొద్ది రోజుల క్రితం కాకానిరోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద నగరంలోకి ప్రవేశిస్తున్న ఒక వాహనాన్ని ట్రాఫిక్ కానిస్టేబుల్ నిలువరించాడు. ఇన్నర్ రింగు రోడ్డు మీదుగా వెళ్లాలని సూచించడంతో.. సదరు డ్రైవర్ ఓ అధికారి వద్ద ఉండే కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి చెప్పించడంతో క్షణాల వ్యవధిలో ట్రాక్టర్‌ను నగరంలోకి వదిలారు. పోలీసు అధికారుల వ్యక్తిగత సిబ్బందే నెలవారీ మామూళ్లు వసూళ్లు చేస్తున్న విషయం తెలుసుకున్న డీఎస్పీ గణతంత్ర వేడుకలకు ఐదు రోజుల పాటు పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో ఆ సిబ్బందిని విధులకు వేశారు. దీనిపైన సదరు కానిస్టేబుళ్లు పెద్ద చర్చకే దారి తీశారు. తమకు డ్యూటీలు ఎలా వేస్తారంటూ...అధికారులనే ఒత్తిడి పెట్టే ప్రయత్నాలు చేశారని వినికిడి.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..



నగరంలో ట్రాక్టర్‌లు, లారీలు ఉదయం వేళల్లో ఎట్టి పరిస్థితుల్లో రాకూడదు. ఖచ్చితంగా నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. నల్లపాడు వైపు నుంచి అధికంగా ట్రాక్టర్లు వస్తున్నట్లు గుర్తించాం. దీనిపై నల్లపాడు పోలీసులతో కూడా ఒకసారి చర్చిస్తాం. కేవలం అనుమతి ఉన్న వాహనాలు మాత్రమే రావాలి. ఇతరత్రా వాహనాలు వస్తే.. జరిమానాలు విధించటంతో పాటు వాహనాలు సీజ్ చేస్తాం.

– ఎం. రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ

వైభవంగా త్యాగరాజ ఆరాధన ఉత్సవం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/14వ అడ్డ రోడ్డులోని నాగార్జున సాంస్కృతిక కేంద్రం, సంగీత కళాశాలలో మంగళవారం త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహించారు. సంగీత త్రయం శ్యామశాస్త్రి, త్యాగ రాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్‌ల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సంగీత కళాశాల అధ్యాపకులు నందకుమార్, నాగార్జున సంగీత కళాశాల, సాంస్కృతిక కేంద్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

హనుమంతుని భక్తి.. రామనామ శక్తే సుందరకాండ



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై కీ.శే.ముప్పవరపు కేశవరావు శత జయంతి సందర్భంగా శ్రీవాల్మీకి మహర్షి ప్రణీత మద్రామాయణ ప్రవచన నవాహ జ్ఞాన యజ్ఞంలో భాగంగా మంగళవారం సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖ శర్మ సుందరకాండపై ప్రవచనం చేశారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ముప్పవరపు వెంకట సింహాచలశాస్త్రి, ఆలయ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మస్తానయ్య, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆంజనేయస్వామి సాగరాన్ని దాటిన విధానాన్ని, లంకలో ప్రవేశం, సీతమ్మవారి అన్వేషణ వంటి విషయాలను సామవేదం షణ్ముఖ శర్మ వివరించారు. శ్రీమన్నారాయణుడు రామావతారంలో మానవుడిగా అవతరించి ధర్మం కోసం భయాన్ని, స్వార్థాన్ని వదిలి ఎలా జీవించాలో లోకానికి చాటడమే రామాయణ సారాంశం అని వివరించారు.

'వికాస్'లో అరుదైన ఆపరేషన్

గుంటూరు మెడికల్: గుండె సమస్యతో అనేక సంవత్సరాలుగా బాధపడుతున్న నెల్లూరు జిల్లా వాసికి అత్యంత అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడినట్లు గుంటూరు వికాస్ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ సురేంద్ర నాగుల పాటి చెప్పారు. మంగళవారం హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన పేర్ల రాము కొంతకాలంగా గుండె సమస్యతో బాధ పడుతున్నట్లు చెప్పారు. చెన్నై, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో వైద్యులను సంప్రదించగా, ఆపరేషన్ చేయాలని, ప్రాణాపాయ సమస్య ఉందని, రూ. 25 లక్షల వరకు ఖర్చు అవుతుందని వెల్లడించారన్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో తమ వద్దకు వచ్చినట్లు డాక్టర్ సురేంద్ర చెప్పారు. సుమారు పది గంటల సేపు వైద్యులు కష్టపడి ఈనెల 18న ఆపరేషన్ విజయవంతంగా చేశారన్నారు. ఐయోటిక్ ఎన్యూరిజం ఆపరేషన్ చేసి రోగి ప్రాణాలు కాపాడామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ సురేష్‌రెడ్డి, డాక్టర్ రంజిత్‌కుమార్, డాక్టర్ కనకదుర్గ పాల్గొన్నట్లు వెల్లడించారు. ఆసుపత్రి సీఈఓ సాతులూరి నరసింహ మూర్తి మాట్లాడారు.

ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వార్డు సచివాలయాల వారీగా డీఅండ్ఓ ట్రేడ్ లైసెన్స్‌లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, తమ రోజువారీ పర్యటనలో ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులు, కార్యదర్శులకు స్పష్టం చేశారు. మంగళవారం కమిషనర్ వసంతరాయపురం, శారదాకాలనీ, రెడ్డిపాలెం, ఇన్నర్ రింగ్ రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, మస్టర్ పాయింట్స్ తనిఖీ, పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి పనులను పరిశీలించి, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. తొలుత వసంతరాయపురం మస్టర్ పాయింట్‌ని తనిఖీ చేసి, తక్షణం సెలవుల రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సచివాలయం వారీగా వ్యాపార సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఉన్నవారు రెన్యువల్ చేసుకునేలా కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసంతరాయపురం రిజర్వాయర్‌ను నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయించాలని ఏఈని ఆదేశించారు. అనంతరం రెడ్డిపాలెంరోడ్ విస్తరణ పనులను తనిఖీ చేసి, త్వరలో శంకరవిలాస్ ఆర్ఓబీ పనులు ప్రారంభించడం జరుగుతుందని, ట్రాఫిక్‌ను రెడ్డిపాలెంరోడ్‌లోకి మళ్లించే అవకాశం ఉన్నందున విస్తరణ పనులు వేగంగా చేపట్టాలని పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, డీఈఈలు కళ్యాణరావు, రమేష్ బాబు, ఏసీపీ మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయుబ్ ఖాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెలవు పెట్టుకునే హక్కు ఉపాధ్యాయులకు లేదా?

మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యవహారశైలిని ఖండించిన ఏపీటీఎఫ్ గుంటూరు శాఖ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ద్వారా ప్రభుత్వాల నుంచి సాధించుకున్న సెలవులను అవసరానికి అనుగుణంగా తీసుకునే హక్కు ఉపాధ్యాయులకు లేదా అని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం తెనాలిలోని ఎన్ఎస్ఎస్ఎం మున్సిపల్ పాఠశాల సందర్శన సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ 24 మంది ఉపాధ్యాయులకు గాను ఏడుగురు అనారోగ్య, అత్యవసర కారణాలతో నిబంధనల మేరకు సెలవు తీసుకోగా, అంత మందికి సెలవు ఏ విధంగా ఇచ్చారని హెచ్ఎంను దబాయించడం, నిలదీయడంతో పాటు వీడియో తీసి వైరల్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతి కి సలహాలు, సూచనలు ఇవాల్సినది పోయి, ఉపాధ్యాయులు పోరాడి సాధించుకున్న సెలవులను తీసుకునేందుకు వీల్లేదనే ధోరణిలో హుకుం జారీ చేయడం మంత్రికి తగదన్నారు. మంత్రి మనోహర్‌కు చేతనైతే పోరాడి సాధించుకున్న ఉపాధ్యాయుల సెలవులన్నింటినీ రద్దు పరుస్తూ ఉత్తర్వులు ఇప్పించగలరా అని ప్రశ్నించారు? పాఠశాలలో వీడియో తీసి వైరల్ చేసే హక్కు మంత్రికి ఎవరు ఇచ్చారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మెమోలు ఇప్పిస్తాననీ, గుంటూరు జిల్లా సమీక్షా సమావేశంలో సైతం ఉపాధ్యాయుల భరతం పడతానని హెచ్చరించడం తగదన్నారు.

యూటీఎఫ్ ఖండన..

గుంటూరు ఎడ్యుకేషన్: తెనాలి మున్సిపల్ పాఠశాల సందర్శన సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జీఓల ప్రకారం హైస్కూళ్లలో పని చేసే ఉపాధ్యాయులకు హెచ్ఎంలు సెలవులను మంజూరు చేస్తారని, స్టాఫ్ మొత్తంలో 50 శాతానికి మించకుండా సెలవును వినియోగించుకునే అవకాశం ఉందని తెలిపారు. నిబంధనలు ప్రకారమే ఉపాధ్యాయులకు సెలవు ఇచ్చినప్పటికీ హెచ్ఎంను దుర్భాషలాడుతూ, ఇందరి ముందు కించ పర్చే విధంగా వీడియో తీసి దానిని వైరల్ చేయడం తగదన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి



మాట్లాడుతున్న కార్యదర్శి టి.లీలావతి

నగరంపాలెం: లింగ నిర్ధారణ చేయడం చట్టపరంగా నేరమని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి టి.లీలావతి అన్నారు. జీజీహెచ్ ఆవరణలోని నర్సింగ్ కళాశాలలో మంగళవారం పి.సి, పి.ఎన్.డి.టీ చట్టంపై న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ ఎవరైనా స్కానింగ్‌లో లింగ నిర్ధారణ చేయమని అడిగితే చేయవద్దని అన్నారు. ఆడ పిల్లలైతే గర్భంలోనే హత్య చేస్తున్నారని పేర్కొన్నారు. సమాజంలో ఆడ, మగ పిల్లలను పోల్చి చూడటం ఎక్కువైందన్నారు. తద్వారా ఆడ పిల్లలను తక్కువగా చూడటం వల్ల పి.సి, పి.ఎన్.డి.టి చట్టం 1994లో అమల్లోకి వచ్చిందని విద్యార్థినులకు వివరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. గతంలో చట్ట సవరణ జరగక ముందు రూ.వెయ్యి జరిమానా, మూడు నెలల జైలు శిక్షగా ఉండేదన్నారు. 2003లో చట్ట సవరణ జరిగాక మూడేళ్ల జైలు శిక్ష, లింగ నిర్ధారణ చేసిన వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. సదస్సులో ప్యానెల్ అడ్వకేట్ కట్ట కాళిదాసు, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత రాణి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకళ, విద్యార్థినులు పాల్గొన్నారు.

యానిమేటర్ల అక్రమ తొలగింపులు ఆపాలి

లక్ష్మీపురం: యానిమేటర్లపై రాజకీయ వేధింపులు, అక్రమ తొలగింపులు ఆపాలని యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండాలక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడుతూ కొన్ని మండలాల్లో ఏపీఎంలు రాజకీయ కార్యకర్తల్లాగా వ్యవహరిస్తున్నారని సరైన పద్ధతి కాదని అన్నారు. యానిమేటర్లను అవినీతి పరులుగా చిత్రీకరించే విధానాన్ని మానుకోవాలని హితవు పలికారు. వీఓఏల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ విధంగా తయారయ్యిందని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలగించిన వీఓఏలందరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీఓఏల వ్యవస్థను సృష్టించానని చెప్పే ముఖ్యమంత్రి, ఆ వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. యానిమేటర్లకు తక్షణమే పెండింగ్ లో ఉన్న ఆరు నెలల వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నా అధికారులు అమలు జరపకపోవడం బాధాకరమని అన్నారు. రెండో రోజు నిరాహార దీక్షలకు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

జీజీహెచ్‌లో అరుదైన ఆపరేషన్



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, పక్కన డాక్టర్ రమణ యశస్వి

గుంటూరు మెడికల్: అరుదైన సర్జరీ చేసి జీజీహెచ్ వైద్యులు యువకుడి ప్రాణాలను కాపాడారు. మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆపరేషన్ వివరాలను మీడియాకు వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఎస్.కిరణ్ కుమార్ అనే 23 ఏళ్ల యువకుడు తన 14 సంవత్సరాల వయసప్పుడు సడెన్‌గా కళ్లు తిరిగి కింద పడిపోయాడు. తల్లిదండ్రులు ఏలూరు ప్రభుత్వ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా డాక్టర్లు పరీక్షించి విజయవాడ ప్రభుత్వ హాస్పిటల్‌కు పంపించారు. విజయవాడ డాక్టర్లు పరీక్షించి బాలుడుకి రక్తహీనత సమస్య వుందని, ఎర్ర రక్తకణాలలో సమస్య(సికిల్‌సెల్ ఎనీమియా) ఉందని చెప్పారు. దీని వలన ఎర్రరక్త కణాలు కొడవలి ఆకరంలో మారి రక్తహీనత వస్తున్నట్లు వివరించి, రక్తం ఎక్కించి కొలుకున్నాక డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించారు. అయినా సమస్య పూర్తి పరిష్కారం కాలేదు. ఇలా కొనేళ్లు గడిచాక రోగికి అదనంగా కడుపు నొప్పి కూడా మొదలైంది. దీంతో తల్లిదండ్రులు గుంటూరుకు జీజీహెచ్‌కు తీసుకొచ్చారని డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. రోగిని పరిక్షించి పసరతిత్తి లో రంగురాళ్ళు (గాల్ బ్లడర్ స్టోన్లు) ఏర్పడ్డాయని, బల్ల (స్ప్లీన్)బాగా ఉబ్బివుంది అని(స్ప్లినోమెగలే)దీని ద్వారా రోగికి తరచుగా కడుపు నొప్పి, రక్తహీనత వస్తున్నట్లు గుర్తించామన్నారు. దీనికి పరిష్కారంగా పసర తిత్తి, బల్ల ఆపరేషన్ చేయాలని నిర్ధారించి, ప్రొఫెసర్ డాక్టర్ పోలయ్య నేతృత్వంలోని మత్తు విభాగం డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్ సహకారంతో బటన్ హోల్ ఆపరేషన్ (ల్యాప్రోస్కోపిక్ సర్జరీ) ద్వారా ఒకేసారి స్ప్లీన్, గాల్‌బ్లాడర్‌ను చాలా చిన్న కోతతో ఈ రెండు పెద్ద అవయవాలను విజయవంతంగా తీసివేశామని చెప్పారు. ఆపరేషన్ చేసేందుకు 6 గంటల సమయం పట్టిందని, 11 రోజుల క్రితం ఆపరేషన్ చేశామన్నారు. ఇదే ఆపరేషన్ ప్రైవేటు హాస్పిటల్‌లో చేస్తే సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. జీజీహెచ్‌లో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా చేశామన్నారు. ఆపరేషన్ అనంతరం 10 రోజుల అబ్జర్వేషన్ అనంతరం అన్ని టీకాలు వేయించి మంగళవారం డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. ఆపరేషన్ ప్రక్రియలతో తనతోపాటుగా వైద్యులు టి.శ్రీలక్ష్మి, కేవీవీ నాగ సంతోష్, సాదిక్ బాషా, విష్ణు, వేణుగోపాల్, కోటేశ్వరరావు, ప్రశాంతి, భరత్, జయప్రకాష్, సంజుష, మత్తు డాక్టర్లు పోలయ్య, హనుమంతరావు, శ్యాంసన్, రిచి, దీప్తి షాళిని, సుహాస్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు. అరుదైన సర్జరీ చేసి యువకుడి ప్రాణాలు కాపాడిన సర్జరీ వైద్యులను డాక్టర్ రమణ యశస్వి అభినందించారు.

ఆరునెలలకే పుట్టిన శిశువులను బతికించాం

కనుమూరి హాస్పటల్ వైద్యుల వెల్లడి



గుంటూరు మెడికల్: బరువు తక్కువగా పుట్టిన ఇరువురు శిశువులకు అత్యాధునిక వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడినట్లు నవజాత శిశువుల వైద్య నిపుణులు డాక్టర్ అడుసుమల్లి వెంకటనాగరాజ చెప్పారు. మంగళవారం గుంటూరు కొత్తపేటలోని కనుమూరి హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేటకు చెందిన హేమలతకు ఆరో నెలరాగానే నొప్పులు వచ్చి సాధారణ కాన్పు జరిగిందన్నారు. ఒకేకాన్పులో ఇరువురు శిశువులు జన్మించారని, ఆడ శిశువు 610 గ్రాములు, మగశిశువు 630 గ్రాముల బరువుతో పుట్టడంతో చిలకలూరిపేట వైద్యులు మెరుగైన చికిత్స కోసం గుంటూరు కనుమూరి హాస్పటల్‌కు రిఫర్ చేశారన్నారు. తాను శిశువులకు మూడు నెలలపాటు అత్యాధునిక వైద్య పరికరాలతో చికిత్స అందించడం వల్ల నేడు వారు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. మంగళవారం వారిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశామన్నారు. కనుమూరి హాస్పటల్స్ అధినేత, ప్రముఖ పల్మనాలజిస్టు డాక్టర్ కనుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ శిశువులను. గత ఏడాది అక్టోబరు 25న తమ ఆసుపత్రికి తీసుకొచ్చామని, నేడు పూర్తి ఆరోగ్యంతో ఇంటికి పంపిస్తున్నామన్నారు.

పశువైద్య శిబిరం ప్రారంభం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరంలో భాగంగా మంగళవారం గుంటూరు నగరంలోని నెహ్రూనగర్ గోసంరక్షణ సంఘం గోశాలలో వెటర్నరీ పాలీ క్లినిక్ ఆధ్వర్యంలో నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నజీర్ అహ్మద్ ప్రారంభించారు. 656 ఆవులకు, 155 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు. వెటర్నరీ పాలీ క్లినిక్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రత్నజ్యోతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఒ.నరసింహారావు, డివిజనల్ డీడీ డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ, రాష్ట్ర జంతు సంరక్షణ సంఘం అధ్యక్షుడు శివరాం, నెహ్రూనగర్ గోసంరక్షణ సంఘం వైస్ ప్రెసిడెంట్ యార్లగడ్డ వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులతో రీ పోస్టుమార్టం



యడ్లపాడు/పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ఏడాదిన్నర కిందట ఖననం చేసిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం కోట గ్రామానికి చెందిన మహమ్మద్ కరిముల్లా(50) ఏడాదిన్నర కిందట గ్రామంలోని బావిలో పడి మృతి చెందాడు. ఆస్తుల వివాదంలో తన తండ్రి మరణంపై కుమారుడు సాధిక్ అనుమానం వ్యక్తం చేశాడు. మత ఆచారం ప్రకారం శవపంచనామాకు పెద్దలు అంగీకరించలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఉత్తర్వులతో మంగళవారం గుంటూరులోని శ్మశానంలో కరిముల్లా శవాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు.